# సజీవ మృత్యువు

ఆకాశం నుంచి అమావస్య చీకటి పరదాలు ఎవరో తొందరపెడుతున్నట్టు చకచకా జారుతున్నాయి.

త్వరత్వరగా ఇంటికెళ్ళాలని వేగంగా అడుగులేస్తోంది వినూష. జివ్వుమని వీస్తోంది చల్లగాలి.

అకస్మాత్తుగా తననెవరో వెంటాడుతున్నట్టు అనుభూతి కలిగింది. క్షణాల్లో భయం ఆమె నరనరంలోకీ జరజరా ప్రాకింది. మనస్సు అస్తవ్యస్తమైంది!

సన్నగా కంపిస్తూ చెమటలు ధారలు కడుతూంటే గుటకలు మ్రింగుతూ గబగబ... గబగబా... నడుస్తోంది....!

నక్కలు ఊళవేస్తున్న శబ్దం అంతకంతకూ సమీపిస్తూ గుండెని ఛిద్రం చేస్తూ..... సమీపిస్తూ..... తనని ఆక్రమిస్తోంది.....!

చటుక్కున వెనుదిరిగి చూసింది. కరాళనృత్యం చూస్తున్నట్టు ఆమె కళ్ళు పెద్ద వయ్యాయి.....తెరచిన నోరు తెరచినట్టే వుండిపోయింది...!

గాలి దగ్గరవుతూ వికృత రూపం పోసుకుంటూ వింతధ్వనులు చేస్తూ తనని కబళించాలని బాహువులు చాస్తూ.....!

ఆమె గుండెల్జారిపోయాయి. భయోద్విగ్నయయ్యింది. కెవ్వున అరుస్తూ పరుగందుకుంది.

ఒంటినుంచి ఘర్మజలం ధారలుగా కారిపోతోంది. నోరు పిడచకట్టుకు పోతోంది. శరీరం నిలువునా కంపించి పోతోంది.....!

పరుగు..... పిచ్చిగా అరుస్తూనే.....పరుగు..!

కాళ్ళక్రింద ఎండిన ఆకులు నలిగి.... ఆ సన్న శబ్దాలు సైతం కర్ణభేరుల్ని బ్రద్దలుగొడుతోంటే మరింతగా బెంబేలు పడుతూ... అరచేత ప్రాణాలు పట్టుకొని చీకట్లో పిచ్చి దానిలా పరుగు... ప..రు...గు.....!

వెంబడిస్తోన్న అదృశ్యశక్తి అంతకంతకూ సమీపిస్తూ... పించి... తన చుట్టూ చేతులు చాపి చుట్టేస్తూ.....!

గబుక్కున మండుతోన్న మంటలోంచో కట్టెని తీసి పట్టుకుని "ఇప్పుడు రా... దమ్ముంటే రా మాడి ఛస్తావ్" అంటూ భయంకరంగా అరిచింది... కాని కీచు శబ్దమే తన చెవులకి విన్పించింది.....!

రొప్పుతూ పళ్ళు నూరుతూ అగ్ని కురిపిస్తూ చూసింది.....

కట్టె వెలుగుకి నిరాకారం భయపడి వెనకడుగేస్తున్న చప్పుడు.....

విజయగర్వంతో చూస్తూ "రా... నీ అంతం చూస్తాను... రా..." అంది బిగ్గరగా రెట్టించిన ధైర్యంతో సవాలు చేస్తున్నట్టుగా.

గాలి యధాస్థితి కొచ్చి ఏమీ జరగనట్టు మౌనంగా.....!

"ఖబడ్దార్.....!"

మరోసారి హెచ్చరించి మండుతోన్న కట్టెని విసిరెయ్యబోతూ మంటవంక చూసి ఉలిక్కిపడింది. అది చితి...!

వెన్నుబాములో గగుర్పాటు... భయంతో గడ్డకట్టుకుపోతూ... ఒక్కడుగు వెనక్కేసిందో లేదో మంటల మధ్యలోంచో ఆకారం... అస్థిపంజరం..... లేచి...... చేతులు చాపి.....!

కంఠనాళాలు తెగేలా అరిచింది.....!

చటుక్కున లేచి కూర్చుంది వినూష. గుండె డొక్కు మోటారు కార్లా కొట్టుకుంటోంది. నైటీ తడిసి ముద్దయ్యింది.....

భయభ్రాంతయై నలువైపులకీ భయంభయంగా చూస్తోంటే భుజం మీదో చేయిపడింది.

కెవ్వుమని అరుస్తూ దాన్ని బలంగా త్రోసేసి మంచం మీంచి దూకి గదిలోంచి పారిపోబోతోంటే "నేను వినూ..." అన్నాడామె భర్త ఆందోళన పడ్తూ.

ఆగింది... అపనమ్మకంగా చూసింది. సత్యమే. తన భర్త. సందేహం లేదు!

'హమ్మయ్య' గుండెల మీద చేతు లేసుకుంది. తిరిగి మంచాన్ని సమీపిస్తూ అనుమానం పూర్తిగా చావక భర్త వంక తేరపారి చూసింది.

"నేనేదో దెయ్యమైనట్టు ఆ చూపేంటి?"

"అహహ..... ఆ ముసలి దెయ్యమేమోనని.....!"

నవ్వేడు. "దెయ్యాల్లో కూడా పడుచువీ ముసలివీ వుంటాయా?"

"వద్దొద్దు ఆ వూసులొద్దు. నేనెంత భయపడ్డానో నీకు తెలీదు"

"ఊరికే భయపడే బదులు దెయ్యాలూ భూతాలూ ఓ ట్రాష్ అని తెలుసుకుంటే మంచిది. అవి కేవలం మన భ్రమ. భ్రాంతి. ఇల్యూజన్ తప్ప నిజం కాదు"

"నిజంగా దెయ్యాలూ ప్రేతాత్మలూ వుండవంటావా?"

"ఉండవు కాదు లేవు... అబ్బ... ఎంత బలంగా నా చేతిని విసిరికొట్టావూ..." చేయి నొక్కుకుంటూ అన్నాడు.

"సారీ డియర్....." అతడి గుండెల మీద వాలి పోయింది.

అంతలో ఏదో గుర్తు రాగా విడివడి "మనం ఈ ఇంటికి కొత్తగా వచ్చేం కదా. ఇందులో దెయ్యముందేమో? అందుకనే తక్కువ అద్దెకి రెంట్కిచ్చారేమో?" అంది ఇంతింత కళ్ళతో అనుమానంగా చుట్టూ చూస్తూ.

"రామ్‌గోపాలవర్మ భూతాన్ని మర్చిపో.... భూత ప్రేత పిశాచాలేం నీ దగ్గరకి రావు... నేనుండగా!"

అతడి స్వరం అదోలా వుంది. ఆ మాటల్లో రెండర్థాలు కన్పించాయి. భయం భయంగా చూసింది. అనుమానిస్తూ సందేహిస్తూ చూసింది. పడగ విప్పి బుసలు కొడుతూ ఎన్నో అనుమానాలు. మరెన్నో భయాలు!

దూరంగా జరిగి పడుకుంది. కనురెప్పలు మూయాలంటేనే భయంగా వుంది. గుడ్లగూబలా చూస్తుండి పోయింది. త్వరగా నిద్రవస్తే బావుణ్ణనుకుంది కాని నిద్రాదేవి కరుణించలేదు!

ఉదయం లేస్తూనే బాల్కనీలో కెళ్ళిందల్లా దెయ్యాన్ని చూసినట్టు ఉలిక్కిపడింది. గగుర్పాటుతో శరీరం ఆసాంతం కంపిస్తోంటే కలవరంగా భయంగా చూసింది.

ఆ ప్రక్కనే - అతి దగ్గర్లో వుందో పాడుబడిన బంగళా!

ఏదో దెయ్యపు హస్తం స్పృశించినట్టు వజవజ వణికింది. పరుగెడుతున్నట్టుగా లోపలి కొచ్చేసింది. భయంతో వణకుతూ ఒగురుస్తోన్న ఆమెవంక చిత్రంగా చూశాడామె భర్త.

"మనం చూళ్ళేదు గాని ఆ ప్రక్కన భూత్ బంగ్లా వుంది..."

నవ్వేడు సత్యం. "రామ్సే బ్రదర్స్ విక్రమ్‌భట్టూ నీ మెదడ్ని బాగానే ఫ్రై చేసినట్టున్నారు"

"కంకాళంలో మెదడుని ఫ్రై చేసుకుని తింటాయిట దెయ్యాలు..." కంపిస్తూ చెప్పింది.

"మై గాడ్! నేనేదో సరదాకంటే... అసల్నీకీ దెయ్యాల గోలేంటి? హైదరాబాద్‌లో ఎంతో ధైర్యంగా వుండే దానివిగా!"

"ఏంటో... అక్కడ్నుంచి వచ్చే ముందునుంచే... ఏదో తేడాగా భయంగా ఉంటోంది...!"

"అతిగా ఆందోళన పడితే తాడు కూడా పాములా కన్పిస్తుంది. గతమంతా ఓ పీడకల అనుకుని మర్చిపో. ఇవాళ మనం కొత్త జీవితం మొదలు పెట్టబోతున్నాం. నిన్న కంపెనీలో డిపాజిట్‌కట్టి చేరాం కదా. ఇవాల్టి నుంచి మార్కెటింగ్ జాబ్ మొదలెట్టాలి. అసలే మనకు రాజమండ్రి కొత్త. అయినా మనిద్దరం టార్గెట్స్ రీచ్ అయ్యి ఆర్నెల్లలో డెవలప్‌మెంట్ మేనేజర్లమై పోవాలి. అది తప్ప ఇంకోటి నీ బుర్రలోకి రానివ్వొద్దు. త్వరగా రెడీ అవ్వు డియర్"

అన్యమనస్కంగా తలాడించింది.

ఇద్దరూ రెడీ ఐ ఇంటికి తాళం వేసి పదడుగులు వేశారో లేదో అయిదారు కార్లూ వ్యాన్లూ వచ్చి భూత్ బంగళా ముందు ఆగాయి.

"సినిమా షూటింగేమో?" వినూష అంది సాలోచనగా చూస్తూ.

"ఏదోట్లెద్దూ.....'

"అంతా భూత్ బంగళాలో కెళ్తున్నారు. ఏంటో చూసెళ్దాం..... జస్ట్ ఒన్ మినిట్.....పగలు చూసేస్తే ఇక రాత్రివేళ భయంగా అన్పించదు" అంది.

చుట్టు ప్రక్కలి జనం ప్రోగవుతూండటం చూసి తలాడించాడు.

ఇంతలో బంగళాలోంచెవరో తనని రారమ్మని పిలుస్తున్నట్టన్పించి అదిరిపడింది. భయవిహ్వలయయ్యింది వినూష.

"వద్దులే వెళ్ళిపోదాం..." అందతడి చేయి పట్టుకుని గుంజుతూ.

"అంతా వెళ్తున్నారుగా. భయమెందుకు. పద"

అతిజాగ్రత్తగా పరికిస్తూ అణువణువూ పరిశీలిస్తూ అయిష్టంగానే అటు అడుగులేసింది.

"ఈ బంగళా వాళ్ళదే. ముసలాయన తన ఆఖరిశ్వాస ఇందులోనే వదలాలనేవాట్ట. అనుకోకుండా మొన్న హార్ట్ ఎటాక్ వచ్చి నిన్న ప్రాణం విడిచాట్ట. కనీసం శవాన్నైనా బంగాళాలోకి తీసుకొచ్చి ఆయన కోరిక తీరుద్దామని హైదరాబాద్ నుంచి తీసుకొచ్చారు....."

ఎవరో ఎవర్తోనో అంటున్న మాటలు వారి చెవిన బడ్డాయి. ఉత్సుకత పెరిగింది. అదే సమయంలో వినూష నఖశిఖపర్యంతం సన్నగా కంపించసాగింది. ఏదో తెలీని భయం ఆమెని భయపెడుతోంది!

అదుర్తోన్న గుండెల్తో జనంలోంచి దారి చేసుకుంటూ వెళ్లి శవాన్ని చూసింది వినూష. పరిచయం వున్న ముఖంలా అన్పించి పరిశీలనగా చూసింది.

అకస్మాత్తుగా శవం కళ్లు తెరచి ఆమెవంక చూసింది. ఆమె గుండెలు గుభిల్లు మన్నాయి. రక్తం గడ్డకట్టిందొక్కసారిగా. ఆ ఉత్తరక్షణాన కనిపించని చెయ్యేదో ఆమెగుండె కాయని మెలితిప్పింది.

'నో...!' బిగ్గరగా అరిచింది. "ఏంటి ఏవయ్యింది వినూ....."

అతడి చెయ్యి గట్టిగా పట్టుకుని "శవం నన్నే... నా వంకే చూస్తోంది.....!" అంది భయోద్విగ్నయై నిలువునా వణకిపోతూ.

అంతా తమ వంక చిత్రంగా చూస్తోంటే ఎంబ్రాస్సింగా ఫీలవుతూ ఆమెని పొదవి పట్టుకుని బయటికి తీసుకెళ్లాడు.

"శవం కళ్ళు తెరవడమేంటి. అబ్సర్డ్!"

"ని... నిజంగా నిజం.... ఆ ముసలోడు నా వంక చూశాడు..." ముచ్చెమటలు ధారలు కడుతోంటే వెనక్కెనక్కి బెదురు చూపులు చూస్తూ అంది.

"ఇది వరకు లేని బేలతనం ఇప్పుడెలా వచ్చింది వినూ? ఇదంతా రాజమండ్రి ప్రభావమే?"

"నాకు చాలా... చాలా భయంగా వుంది....." అతడ్ని కరచిపట్టుకునంది.

ఆమె స్థితి చూసి కదిలిపోయాడు. "గాలీధూళీ లాటిది సోకిందని నీ భయమైతే సాయంత్రం ఆంజనేయస్వామి గుడికెళ్ళి రక్షతాడు కట్టిస్తాన్లే..."

"అప్పుడింక ఆ ముసలి పీనుగు నా జోలికి రాడు కదా? చచ్చినా రాడు కదా?"

"చచ్చాడు. ఇంకెలా వస్తాడు గాని... అవునూ అతడెందుకొస్తాడనుకుంటున్నావ్? అతడ్ని నువ్వు చూసింది ఇప్పుడే కదా?"

ఆమె మాట్లాడలేదు. మౌనంగా ఉండిపోయింది. అయోమయంగా చూశాడు. ఆమె ఏదో దాస్తోందన్పించింది. అయినా రెట్టించలేదు.

దగ్గర్లోని టీ బడ్డీలో టీ త్రాగేక కొంచెంగా దార్లో పడింది వినూష.

కొత్త ఆఫీసు కెళ్ళారు. కంపెనీ కార్యకలాపాల గురించీ మార్కెటింగ్ స్ట్రాటజీ గురించీ తెలుసుకున్నారు. బ్రోచర్లు కలెక్ట్ చేసుకున్నారు. ఏ సెగ్మంట్ని టార్గెట్ చేసుకోవాలో బోధపడింది. రెట్టించిన ఉత్సాహంతో ఆఫీసులోంచి బయటపడే సరికి చీకటిపడింది.

రిక్షా ఎక్కి తిన్నగా ఇంటికెళ్ళారు.

ఇంట్లో కెళ్తూ భూత్ బంగళా వైపు చూసింది వినూష. అది కదుల్తూ వేగంగా తన వైపు... తన మీదకి వచ్చేస్తోంది...!

"బాబోయ్ వచ్చేస్తోంది...సత్యం... అది ఆ ముసలోడి పనే.....వాడే దెయ్యమై..." చీరుకుంటూ అరుస్తూ ఏడుస్తూ అతడ్ని గట్టిగా వాటేసుకుంది.

సరిగ్గా అప్పుడు ఆకాశం పగిలి ముక్కలవుతుందేమో అన్నట్టు ఉరిమింది. కళ్ళు పగిలేలా ఓ పెద్ద మెరుపుమెరిసింది.

నిలువెల్లా భయంతో వణకిపోయింది. "దెయ్యం.. దెయ్యం..!"

"అరె. ఎవర్లేరు ఎవ్వరావటం లేదు. ఎందుకంతలా నీలో నువ్వే ఏవేవో వూహించుకుని భయపడ్తావ్?" విసుక్కున్నాడు.

"ఆ ముసలోడు నన్ను వదల్టం లేదు. దెయ్యమై నా మీద పగబట్టి...!" వజ వజ వణకి పోతోంటే ఆమె చుట్టూ చేతులేసి గట్టిగా పట్టుకున్నాడు.

"వద్దు. ఇక్కడుండొద్దు.... ఇక్కడుంటే నన్ను పీక్కు తినేస్తాడు. వెళ్లిపోదాం సత్యం... దూరంగా ముసలోడికి అందనంత దూరంగా వెళ్లిపోదాం..."

"సరేలే.... రేపెళ్లి పోదాం... టైం లేకపోయింది గాని గుడికెళ్లి రావాల్సింది.... ఆంజనేయస్వామిని తలచుకో. దుష్ట శక్తుల నీడ నీ మీద పడదు..."

ధైర్య వచనాలు చెబుతూ ఇంట్లోకి తీసుకెళ్లాడు. ఆమె మాత్రం అతడి చేతిని వదల్లేదు. గట్టిగా పట్టుకునే వుంది.

"నన్ను వదలకు... వదిల్తే ఆ రోగ్...!" ఏడ్చేసింది.

"కూల్డౌన్ వినూ... నథింగ్ హ్యాపెన్డ్... ఏం జరగలేదు. అంతా నీ భ్రమ..."

ఆమె చేతులు విడిపించుకునెళ్లి మంచినీళ్లు తెచ్చిచ్చాడు. ఒక్క గుక్కలో తాగేసింది.

"అన్ని లైట్లూ వేసి వుంచు... కిటికీలన్నీ మూసెయ్... బాల్కనీ వైపు డోర్ త్వరగా వేసి బోల్టు పెట్టెయ్. ఎట్నుంచైనా రావొచ్చు...గాలిలా మారి.....!" భయంతో ముడుచుకుపోతూ అంది.

"నేనున్నాగా. ధైర్యంగా వుండు... వంట చేస్తాను..."

"వద్దొద్దు... ఇవాళిలాగే వుండేపోదాం... నన్ను క్షణం కూడా వదలొద్దు... ప్లీజ్ నేను ఒంటరిగా వుంటే... అమ్మో... నన్ను పీక్కు తినేస్తాడు!"

"అసలు ఏమైంది వినూ!" ఆమె కళ్ళల్లో గడ్డ కట్టిన భయాన్ని చూసి ఆందోళనతో అడిగాడు.

"ష్....." ఘల్లు ఘల్లుమనే శబ్దాలు విన్పిస్తోంటే చెవులు రిక్కించింది.

గుండెలు పగిలేంత ఉద్వేగంతో వూగిపోతోంది. ముచ్చెమటలకి ఆమె దుస్తులు తడిసి ముద్దయ్యాయి. కళ్ల నిండా భయం నర్తిస్తోంటే పిచ్చి చూపులు చూడసాగింది.

అతడికీ భయమేసింది. బతుకు తెరువు కోసం సిటీ నుంచొచ్చారు. ఇక్కడికి రాగానే ఆమెకిలా అయ్యింది. నిజంగానే దెయ్యాలున్నాయేమో? అది కామపిశాచేమో? గతజన్మలో వినూషని మోహించి ఆమె దక్కలేదని ఆత్మహత్య చేసుకుని... ఇప్పుడు దెయ్యమై వినూని ఆవహించాలని....!

అతడి ఒళ్లు జలదరించింది. అరవబోయే నిగ్రహించుకున్నాడు. ఆమెని మరింతగా హత్తుకుని కూర్చుని "భయపడొద్దు... నేనున్నాగా... శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం..." బిగ్గరగా వల్లించసాగాడు.

ఆమె కూడా లోలోపల అనుకోసాగింది.

కాస్సేపటికి వాతావరణం తేలికైనట్టుగా అన్పించింది. కొంచెంగా రిలీఫ్ ఫీలయ్యింది వినూష.

"లైట్లుంచే పడుకుందాం. ఈ రాత్రి గడిస్తే చాలు. రేపు చచ్చినా ఈ ఇంట్లో వుండొద్దు..."

"ఉండొద్దు గాని అవేం మాటలు? అలాటివొద్దు..." అతడి స్వరం అతడికే వికృతంగా అన్పించింది.

ఆమె కూడా అదోలా చూసింది. మళ్లీ భయం ఆమెలో పురుడు పోసుకోసాగింది.

కదలక మెదలక పడుకున్నారు. కళ్లు తెరచుకునే వున్నారు. ఒకరి చేయి ఒకరు గట్టిగా పట్టుకున్నారు. ఫ్యాన్ తిరుగుతున్నా ముచ్చెమటలు ధారలుగా కారి పక్క తడిపేస్తున్నాయి. ఒకరి గుండెశబ్దం ఒకరికి స్పష్టంగా విన్పిస్తోంది. లబ్‌డబ్ అనిగాక బల్ బడ్ అని వారి చెవుల్లో దూరుతోంది.....!

కిటికీ రెక్క కదిలినా ఫ్యాన్ గాలి చిరు శబ్దం చేసినా అదిరిపడుతున్నారు. ఆగంతకుడెవరో లోపలికి చొచ్చుకొస్తున్నట్టు బెంబేలు పడుతున్నారు. అదే సమయంలో నిశ్శబ్దమూ వారిని చిత్రహింస పెట్టసాగింది!

పూర్తిగా భయం గుప్పిట్లో ఇద్దరూ.....!

బంగళాలోని శవం లేచింది. మెల్లగా నడుస్తూ బయటికొచ్చింది. తిన్నగా వినూష వాళ్ళింటి ముందుకొచ్చి నిలబడింది. తలుపులు వాటంతటవే తెరచుకున్నాయి. లోపలికి.... గదిలోకి వెళ్ళింది.... వినూష చేయిపట్టుకుని లా..గిం....ది.....!

"ఫోరా ఫో... దుర్మార్గుడా ఫో..... ఫో....." మంచం మీద లేచి నిలబడి ఎవరి పట్టు నుంచో విడిపించుకోడానికి పెనుగులాడింది వినూష. ప్రాణభీతితో అరుస్తూ ఏడ్వసాగింది. ఆ ఏడ్పు కూడా విచిత్రంగా..... వుంది...!

చటుక్కున లేచి అయోమయంగా చూస్తూ ఆమెని గట్టిగా పట్టుకుని కుదిపాడు సత్యం. భయానికి భయపడి గుండెస్తంభిస్తోంటే పిచ్చిగా చూసింది.

"ఎవర్లేరు వినూ... అసల్నీకేవయ్యింది...?!" దు:ఖస్వరంతో అడిగాడు.

"ఆ ముసలోడు....." ఏడుపు తన్నుకొస్తోంటే అతికష్టం మీద నోరు పెగల్చుకునంది.

"ఏ ముసలోడు?" "వాడే... వాడే.... మొన్న హైదరాబాద్‌లో....."

"హైదరాబాద్‌లో? ఏవయ్యింది? అసలేం జరిగిందో దాచకుండా చెప్పు వినూ..." ఉద్విగ్నుడయ్యాడు సత్యం.

మంచం మీద కూలబడి ట్రాన్స్‌లో వున్నట్టు చెప్పసాగింది.

"మనం కొత్త జాబ్‌లో చేరాలి. సెక్యూరిటీ డిపాజిట్‌కి డబ్బు సమకూరలేదు. అన్ని ప్రయత్నాలూ విఫలమయ్యాయి ఉద్యోగాలు చేతికందినట్టే అంది చేజారిపోయినట్టేనని విలపిస్తూ బ్యాంక్ ముందు కూర్చున్నాను. లోపల్నుంచో ముసలోడు డబ్బు బ్యాగ్‌తో వచ్చాడు. నేను తప్ప బయటెవ్వరూ లేరు. ఎవరూ చూడటం లేదన్న మొండి ధైర్యంతో ఆ బ్యాగ్ లాక్కున్నాను. ఊహించని ఘటనకి కాబోలు కెవ్వుమని అరిచి గుండెపట్టుకుని కూలబడ్డాడు ముసలోడు. మరొక్క క్షణం వృథా చెయ్యకుండా బ్యాగ్‌తో పారిపోయి వచ్చేశాను. ఎక్కడో దొరికిందని నీకు అబద్ధం చెప్పేను....."

"అయితే ఆ ముసలాడి శవమే ఇవాళ పొద్దుట బంగళాలో...!"

అవునన్నట్టు తలాడించింది. అతడికంతా అర్థమైంది. గాఢంగా నిట్టూర్చాడు.

"అందుకే కాబోలు భయాన్ని సజీవ మృత్యువంటారు. పైగా ఇది మామూలు భయం కాదు. పాపభయం. మన రక్తంలో జీర్ణించుకున్న సంస్కృతి అలాటిది. పాపం చేసినప్పుడు పశ్చాత్తాపాగ్నిలో కాలి పరిశుద్ధమయ్యే దాకా మనల్ని భయపెడ్తూనే వుంటుంది. పాపభీతి వెంటాడుతూనే వేటాడుతూనే అనుక్షణం నరకాన్ని చవి చూపిస్తూనే వుంటుంది. వద్దొద్దు. ఆ పాపిష్ఠి డబ్బూ వద్దు. ఆ పీడ కలలూ వద్దు. రేపా డబ్బు తీసుకెళ్ళి తిరిగిచ్చేద్దాం. ఉద్యోగాలు పోయినా ఫర్లేదు జీవితాలు నష్టపోకూడదు..."

సత్యం కళ్ళల్లోకి ఆర్తిగా చూసింది. భరోసాతో చూసింది.

ఆమె కళ్ళు అశ్రుపూరిత మయ్యాయి. అతడ్ని ప్రేమగా సుడిగాలిలా చుట్టేసింది వినూష!

**(చిత్ర సకుటుంబ మాసపత్రిక డిసెంబరు 2011)**